# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






## ప్రపంచానికి దిక్సూచి సంస్కృతం



తిరుపతి విద్య, జూన్ 29 ప్రభాతవార్త
ప్రపంచానికి దిక్సూచిగా మానవ జ్ఞాననిధిగా వెలుగొందుతోందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు.నేపాల్లో జరుగుతున్న 19వ ప్రపంచ సంస్కృత సమ్మేళనంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు.సంస్కృత భాషా వైభవాన్ని, సంస్కృత భాషలోని విజ్ఞానాన్ని భావి తరాలకు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.సంస్కృతంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్సు విశ్వవిద్యాలయాలు నిశితంగా పరిశీలించి సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక యువతకు అందించాలని కోరారు. సంస్కృత భాషాభివృద్ధికి ప్రతి వ్యక్తి కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

## పలమనేరు మార్కెట్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం

### -తప్పిన పెను ప్రమాదం



పలమనేరు,జూన్ 29,ప్రభాతవార్త:
పలమనేరు మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం గుర్తితెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టడంతో ఆ మంటలు సమీపంలోని దకాణం వద్ద ఉన్న ప్లాస్టిక్ క్రేట్లకు తాకడంతో ఒక్కసారిగా ఆ క్రేట్లలో మంటలు చెలరేగడం జరిగింది.విషయం తెలుసుకున్న పలమనేరు అగ్ని మాపక సిబ్బంది తక్షణం సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో ప్రక్కనే ఉన్న మండీలోని క్రేట్లకు మండలు వ్యాపించకుండా పెనుప్రమాదం తప్పింది.

## రాష్ట్రంలో పలమనేరు మున్సిపాలిటీ

# ఆదర్శంగా నిలవాలి

### -రూ.1.12 కోట్లతో వ్యర్థాల రీసైక్లింగ్ కేంద్రం ఏర్పాటు
### -ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు,జూన్ 29,ప్రభాతవార్త:
రాష్ట్రంలో పలమనేరు మున్సిపాలిటీకి అరుదైన గుర్తింపు రావాలని, అన్ని మున్సిపాలిటీలలో పలమనేరు మున్సిపాలిటీ ఆదర్శంగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు.స్థానిక జి.కోటూరు సమీపంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యర్డ్ వద్ద ఆదివారం నూతనంగా రూ.1.12 కోట్లతో ఏర్పాటు చేపట్టనున్న(బయో రేమిడియేషన్,బయో మైనింగ్) వర్థాల పునర్వినియోగ కేంద్రానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పలమనేరు మున్సిపాలిటీ రాష్ట్రంలో ఆదర్శంగా తీసుకురావాలని అనేక కార్యక్రమాలను చేపట్టామని అందులో భాగంగా గతంలో పలు మార్లు రాష్ట్రంలో పలమ నేరు మున్సిపాలటీకి అరుదైన గౌరవం, అవార్డులు దక్కిందన్నారు. పలమనేరు రాష్ట్రంలో అందరికీ ఆదర్శంగా మారాలని రూ.1.12 కోట్లతో మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను యంత్రాల ద్వారా పునర్వినియోగించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ప్రజలు తడి-పొడి చెత్తలను వేరువేరుగా మున్సిపల్ కార్మికులకు అందించడంతో వారు సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారు చేయడం జరుగు తుందన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ప్రజలు తగ్గించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి,నాయకులు ఆర్‌వి. బాలాజీ, సుబ్రమణ్యంగౌడ్,కుట్టి,గిరిబాబు, నాగరాజు, ఖాజా, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది పాలనలో ఉభయజిల్లాల ఎమ్మెల్యేల పనితీరు

# ప్రశ్నార్థకమేనా!?



ప్రభాతవార్త-తిరుపతి:
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదికాలం పాలన పూర్తిచేసుకున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై జరిపిన సర్వేలో విస్తుబోయే అంశాలు తెలిశాయన్నది ఇప్పుడు కూటమి పార్టీల నేతల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రజలు నమ్మి ఓట్లేశారని, వారికి అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించాలని పదేపదే సిఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాలోకేశ్ కూడా నిర్దేశం చేస్తున్నారు. ప్రజల మద్దతు ఉన్న నాయకులకు పెద్దపీట వేస్తానని స్వయంగా మహానాడులో బాబు వెల్లడించారు కూడా. అదేగాక ఏడాది పాలనలో అటు చిత్తూరు ఇటు తిరుపతి సొంత జిల్లాల్లో కుప్పం నుండి గెలిచిన చంద్రబాబు మినహాయించి 12మంది కూటమి ఎమ్మెల్యేలు (11మంది టిడిపి,1 జనసేన) నియోజకవర్గాల్లో ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉన్నారు,వారి సమస్యలు పరిష్కారంలో ఏమేరకు సహాయం చేశారనే అంశాలపై చేపట్టిన సర్వేలో విస్తుబోయిన విషయాలు ప్రజల నుండి వెల్లడైందనేది పార్టీలో గుప్పుమంటోంది. ఈ నేపథ్యంలో నిన్ననే ఎంతో వేడుకగా అమరావతిలో ఏడాదిపాలన "సుపరిపాలన"సమావేశం భారీస్థాయిలో జరిగింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు కూడా హాజరవడంతో అభివృద్ధి,సంక్షేమంపై సిఎం స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ,సంక్షేమ పథకాలు అమలులో అధికారయంత్రాంగం ప్రజాప్రతినిధులతో కలసి పనిచేయాలని దిశానిర్దేశం కూడా చేయడం విశేషం. మరోవైపు పార్టీలో కార్యకర్తలే ముఖ్యమని, చాలా శక్తిమంతులని, వారి అభిప్రాయాలు, ఇచ్చే సలహాలు తప్పకుండా తీసుకుని అమలుచేస్తానని కూడా ఇదివరకే సిఎం, మంత్రి లోకేశ్ కూడా తమదైన శైలిలో వెల్లడించారు. మళ్ళీ కార్యకర్తలు బాధపడే పరిస్థితి, ఓడిపోయే పరిస్థితి రానివ్వకూడదని నర్మగర్భంగా వెల్లడించారు. ఓ వైపు రాష్ట్రంలో ప్రజల సంక్షేమం,వారిని ఆర్థికంగా పైకి తీసుకువచ్చే అంశాలపై దృష్టి సారిస్తూనే ఎమ్మెల్యేల పనితీరుపై బాబు ప్రత్యేక ఫోకస్ పెట్టడం ఇప్పుడు సంచలనంగా మారింది. ప్రజల ,కార్యకర్తల మద్దతుతోనే భారీ మెజార్టీ వచ్చిందనేది సిఎం విశ్వాసం.

**-అంతరంగికుల సర్వేలో ఎమ్మెల్యేల పనితీరుకు ర్యాంకు:**
ఏడాది పాలనపై సిఎం చంద్రబాబు తనదైన శైలిలో చేపట్టిన ఆంతరంగికుల సర్వేలో సొంత జిల్లాల్లోని 13మంది ఎమ్మెల్యేల్లో

### ఆంతరంగికుల సర్వేతో అధిష్టానం అంతర్మథనం !!

శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, చంద్రగిరి, పలమనేరు, చిత్తూరు, జిడినెల్లూరు, పూతలపట్టు, తిరుపతి(జనసేనపార్టీ) పనితీరుపై భిన్నాభిప్రాయాలు రావడంతో అధిష్టానం అంతర్మథనంలో ఉన్నట్లు సీనియర్ నేతల్లో గుసగుసలు. అభివృద్ధి, సంక్షేమపథకాలు చంద్రబాబు అమలుచేస్తున్నా ఎమ్మెల్యేల తీరుమాత్రం బాగోలేదనే వ్యాఖ్యలు జనం నుండి వెల్లడైనట్లు సమాచారం. ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజాభిప్రాయం మేరకు గ్రీన్‌జోన్‌లో నలుగురు ఎమ్మెల్యేల పనితీరు ఉండటం, వీరిలో వైసిపి ప్రాతినిథ్యం పుంగనూరు కూడా చేరడంతో మరింత చర్చగా మారింది. మిగిలిన నియోజకవర్గాల్లో ఆరంజ్‌జోన్‌లో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నట్లు, రెడ్‌జోన్‌లో మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేల పనితీరు ఉందనే సంకేతాలు ,సమాచారం ప్రభుత్వానికి చేరడం ఇప్పుడు సంచలనంగా మారిందనేది కూటమి పార్టీల్లో చర్చనీయాంశమైంది. ఈ సర్వే ప్రాతిపదికన ఇప్పటికే మంత్రి లోకేశ్ కూడా ఆ ఎమ్మెల్యేలకు మూడునెలలు మార్పు గడువు విధించడం ఇప్పుడు ఎవరు ఏంటనేది తేల్చుకునే పరిస్థితి ఏర్పడింది. మరీ ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించిన వీరంతా ఇలాగే పనితీరు సాగిస్తారా?లేక మార్పుచేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన అభివృద్ధికి ముందుకు కదులుతారా అనేది ప్రజలే నిర్ణయించాల్సిన అవసరం వచ్చింది.

# అంతర్ రాష్ట్ర దోపిడి దొంగ అరెస్టు

### రూ. లక్ష 50 వేల రూపాయల విలువైన బంగారు నగలు, మోటార్ సైకిల్ స్వాధీనం



తిరుపతి కార్పొరేషన్, జూన్ 29, ప్రభాతవార్త
అంతర్ రాష్ట్ర దోపిడి దొంగ అరెస్టు చేసి ఒక లక్ష యాభై వేల రూపాయిలు విలువైన 11.3 గ్రాములు బంగారు నగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి క్రైం పోలీసులు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేది ఫిర్యాది ఫరూక్ తన కుటుంబంతో కలిసి నెల్లూరులో ఉన్న దర్గా దర్శనంకు వెళ్తూ మోటర్ సైకిల్‌ను కూడా లోపల వరండాలో పెట్టి ఇంటికి బయట తాళం వేసుకుని వెళ్ళారు. మరుసటి రోజు 10వ తేది ఉదయం 9 గంటలకు మరలా ఇంటికి వచ్చి చూడగా ఇంటికి ఉన్న తాళంను ఎవరో దొంగలు పగుల కొట్టి ఇంటి బీరువాను పగులకొట్టి నగలు, డబ్బుల కోసం వెతకి డబ్బులు, నగలు లేకపోవడంతో ఇంటిలో పెట్టిన హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్ దొంగిలించుకుని వెళ్ళారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సిసిఎస్ అడిషనల్ ఎస్పీ నాగభూషణ రావు పర్యవేక్షణలో తిరుపతి సిసిఎస్ డిఎస్పి శ్యామ్ సుందరం ఇన్స్పెక్టర్లు వి. చిన్నపెద్దయ్య, ఎస్. శివకుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్ఐ సుభాన్ నాయక్, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి అనుమానితుల గురించి విచారించి, వారి యొక్క కదలికల పైన నిఘా పెట్టి, ఆదివారం ఉదయం 11 గంటలకు హరే రామ హరే కృష్ణ రోడ్డులో ఎన్‌జిఓ కాలనీ వద్ద ముద్దాయి కృష్ణప్ప రాజేష్ (23) అరెస్టు చేసి, అతని నుండి మొత్తం 50 వేల రూపాయిలు హీరో మోటార్ సైకిల్, బంగారు నగలు 11.3 గ్రాములు విలువ చేసే ఒక లక్ష రూపాయిలను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి కృష్ణప్ప రాజేష్ పై పలు పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుపతి సిసిఎస్ ఇన్స్పెక్టర్‌లు వి.చిన్న పెద్దయ్య, యన్.శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ సుబాన్ నాయక్ క్రైమ్ పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్ళు మునిరాజులు, విశ్వనాథ్, కానిస్టేబుల్ మోహన్, హరి ప్రసాద్‌లను తిరుపతి జిల్లా ఎస్పి అభినందించి వారికి నగదు రివార్డ్‌లు అందించామని అని క్రైం డిఎస్పి తెలిపారు.

## గోవిందుని సర్వదర్శనానికి 20గంటలు



తిరుమల,జూన్ 29 ప్రభాతవార్తప్రతినిధి:
రెండురోజులుగా కొండపై భక్తజనసంద్రంగా మారింది. వారాంతపుకావడం,శని ఆదివారాలు సెలవు రావడంతో భక్తులు భారీగా చేరారు. ఆదివారం ఉదయానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని 32 కంపార్టుమెంట్లు నిండిపోయి భక్తులు వెలుపల క్యూలైన్లలో బారులుతీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి 20గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశదర్శనానికి 4గంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు.

## జిల్లా కలెక్టర్‌చే సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



శాంతిపురం, జూన్ 29 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు జూలై 2న శాంతిపురం మండలంలో పర్యటిస్తున్న విషయం విదితమే. దీంతో ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్‌లు సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు ఏర్పాట్లపై తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. తిమ్మరాజుపల్లి గ్రామం, తులసినాయనపల్లి వద్ద బహిరంగ సభ ప్రాంతాలను వారు పరిశీలించారు. సిఎం పర్యటనను పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, అధికారులు,నేతలు పాల్గొన్నారు.

## ద్రౌపదమ్మ గ్రామోత్సవం



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబందంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ స మేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదమ్మ గ్రామోత్సకం అంగ రంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో అర్జునుడు,ద్రౌపదమ్మ, పాండవుల ఉత్సవ విగ్రహాలను కన్నులు మిరుమిట్లు గొల్పొనట్లు అలంకార మండపంలో ముస్తాబు చేసారు. సప్పరంలో ప్రతిష్టించి ముందు పోతురాజు పైలట్‌గా వెళుతుండగా వెనుక అమ్మవారు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం పాత వరదయ్యపాళెం రోడ్డు, జయరామారావు వీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది. అమ్మవారికి ఇంటింటి వద్ద విశేష హరతులందించారు. ఉత్సవంతో పాటు ఆలయ ఉద్యోగులు దుర్గాప్రసాద్, సాయి,యోగిలు రాగా అర్చకులు పురుషోత్తం, రవి, తులసిలు పాల్గొన్నారు.

## నందివాహనంపై చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుడు సాక్షాత్కారం



నారాయణవనం, జూన్ 29 ప్రభాతవార్త :
మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అధికార నందివాహనంపై స్వామి, అమ్మవార్లు ఊరేగారు. రాత్రి 7గంటలకు స్వామి, అమ్మవార్లను నందివాహనంపై అధిరోహించి ఘనంగా ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో శుద్ధి, నిత్య కైంకర్యపూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం, స్వామి, అమ్మవారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి నైవేద్యం సమర్పించుకున్నారు.సూపరింటెండెంట్ ధర్మయ్య, ఎఇఓ రవి, ఆలయపర్యవేక్షకులు నాగరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుపల క్యూలైన్ల నియంత్రణ ఎప్పుడో!?

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
1990వ సంవత్సరంవరకు రోజుకు 20వేలమంది భక్తులు మాత్రమే తిరుమలకు చేరుకునేవారు. ఇలా వచ్చిన వీరికందరికీ ఆలయంలోపల ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామిని మరీ దగ్గరగా వీక్షించేలా కులశేఖరపడివరకు అనుమతించేవారు. 1992వ సంవత్సరంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజువారీగా 30వేలకు చేరింది. దీంతో అదే సంవత్సరం ఆలయంలోపల రాములవారిమేడవరకు (లఘుదర్శనం)మాత్రమే అనుమతించి దేవుని దర్శనం చేయించేవారు. ఇలా 2000వ సంవత్సరంలో ఈ రద్దీ కాస్త పెరిగి రోజుకు 60వేలమంది వరకు వచ్చేవారు. ఉన్న వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారు. దీన్ని తెలుసుకున్న అప్పటి రాష్ట్రప్రభుత్వం, టిటిడి పాలకమండలి అదనంగా మరో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ అవసరాన్ని గుర్తించింది. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మరింతగా పెరగడంతో 2000 సంవత్సరంలో వైకుంఠమ్ 2 కాంప్లెక్స్ నిర్మించి క్రౌడ్‌మేనేజ్‌చేశారు.అక్కడ నుండి ప్రతి ఏటా తిరుమలేశుని దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం శ్రీవారి భక్తులు రోజువారీగా అనూహ్యంగా లక్షమంది దాటడంతో ఔటర్‌రింగురోడ్డు శిలాతోరణంవరకు కిలోమీటర్లు క్యూలైన్లలో భక్తులు ఎండకు,వానకు,చలికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. సాధారణరోజుల్లోనే లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు, విశేషరోజుల్లో 1.50లక్షల మంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. సాధారణరోజుల్లోనే లక్షమందివరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు దూరం భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి.గంటకు 4,500మంది భక్తులకు మహాలఘువిధానం(ఆలయంలోపల జయవిజయులవరకే)లో అనుమతిస్తున్నా 90వేలమందికి మాత్రమే దర్శనం చేయించగలుగుతున్నారు.సాధారణరోజుల్లోనూ వైకుంఠమ్ కాంప్లెక్స్‌లు నిండితేనే భక్తులకు కష్టాలు మొదలవుతాయి. ఎండకు,వానకు ,చలికి ఇబ్బందులు పడటం తప్పడంలేదు. ఇప్పటికీ టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెలుపల క్యూలన్లలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తులు సంతోషంగా తిరిగి వెళ్ళాలని తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు ఆకాంక్షించడం పరిపాటి. కిలోమీటర్లు దూరం క్యూలైన్లకు స్వస్తిపలకడానికి తిరుమలలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణమే మంచిదనే అభిప్రాయాలు శ్రీవారి భక్తుల నుండి బలంగా వినిపిస్తోంది.

## ముక్కంటీశుని ఆలయం

# శివనామస్మరణతో పునీతం



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిటకిట లాడింది.వేసవి సెలవులు వచ్చినా కానరాని రద్దీ రెండురోజులుగా భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు.రెండు నెలల తరువాత ఆలయంలో రద్దీ అధికంగా కనబడింది. అంతేకాక రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. తెయితే ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఎన్నో సంస్కరణలు చేపడుతున్నా ఆచరణలో ఆలయంలో ఎవరు దళారులో? ఎవరు ఉద్యోగులో తెలియని ఆగమ్య గోచరంగా మారింది. అయితే సామాన్య భక్తులకు తిప్పలు తప్పటం లేదు. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆదివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిథులతో కళ కళ లాడింది.స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించిన సంస్కరణలతో ఆలయ ఆదాయాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆదివారం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా ఇఓ డి.బాపిరెడ్డి వారి సిబ్బందిని పరుగులు తీయించారు.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**
నాలుగైదు రోజులుగా పరిమితంగా ఉన్న భక్తుల సంఖ్య ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30 వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయిలో ఆరువేల రాహుకేతు దోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.సంస్కరణలతో ప్రతి ఒక్కరు టిక్కెట్టు కొనుగోలు చేయాలనే నిబంధనలతో ప్రత్యేక దర్శన టిక్కెట్టు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు పది వేల మందిగా ఆలయ ఇఓ బాపిరెడ్డి వివరించారు. రాహుకేతుదోష నివారణ పూజలు ఆరువేలు జరిగాయి. ఇక ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు 8వేలు దాటారు. అభిషేకాలు 98 జరిగాయి. ఆలయంలో కొత్త దళారులు దర్శనమిస్తున్నారు. ఎవరు ఎవరో అంతుపట్టని పరిస్తితి. భక్తులకు సుదర్శనం కోసం ఎన్నో సంస్కరణలు అమలు చేస్తున్నా దళారుల ఆటకట్టించలేకున్నారు. మరి ఈ దుస్తితి ఎప్పటికి పరిష్కారమౌతుందో వేచి చూడాలి.

## గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా రెడ్డప్పరెడ్డి

సదుం, జూన్ 29, ప్రభాతవార్త





ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పుంగనూరు సర్కిల్ ఉప అధ్యక్షులుగా తాటిగుంటపాలెం బి పి ఎం రెడ్డప్ప రెడ్డిఏకగ్రీవంగా ఎన్నికైనారు. పుంగ నూరులో పెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లోఉపాధ్యక్షులుగాతాటికుంట పాలెం బిపి ఎం ఎం రెడ్డప్ప రెడ్డి, ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అదేవిధంగా అసిస్టెంట్ సెక్రటరీగా నడిగడ్డ ఏబిపిఎం కే రామయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా సదుం పోస్ట్ ఆఫీస్‌లో పనిచేసే రమేష్ బాబు ఎన్నికైనారు. సదుం పోస్ట్ ఆఫీస్ పరిధిలో గతంలో ఎవరికి పదవులు లేవు.ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ముగ్గురికి పదవులు లభించాయి. వీరిని పలువురు అభినందించారు.

## సంతానలక్ష్మీ వైష్ణవీమాత పాహిమాం...!



చౌడేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త

పుదిపట్ల వైష్ణవీదేవి ఆలయంలో జరుగుతున్న వారాహీమాతా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజున అమ్మవారు రక్తపంచమి వైష్ణవీదేవిగా అవతారమెత్తి భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నవగ్రహదోష నిర్మూలన, సర్వకార్యసిద్ధి జరుగుతుందన్న నమ్మకంతో అమ్మవారిని ఆరాధించారు. ఉదయాన్నే ప్రధానార్చకురాలు శ్రావని ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణగావించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్రతీర్థప్రసాదాలందించారు. తెల్లనీళ్ళపల్లి శంకర్‌రెడ్డి, శంకరమ్మలు ఉభయదారులుగా వ్యవహరించారు.

## ఎఐజిటి ఉద్యోగ సంఘ కార్యదర్శిగా వేలూరు సుబ్రమణ్యం

చౌడేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త



ఆల్ ఇండియా గ్రామీణ తపాలాశాఖ ఉద్యోగుల సంఘ పుంగనూరు బ్రాంచి కార్యదర్శిగా మండలంలోని పరికిదొనకు చెందిన వేలూరు సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. ఆదివారం పుంగనూరులో సంఘ జిల్లా, నియోజకవర్గ నాయకుల సమక్షంలో జరిగిన ఏకగ్రీవ ఎన్నికల్లో వేలూరు సుబ్రమణ్యం కార్యదర్శిగా ఎన్నుకొన్నట్లు ఆయన వివరించారు. తపాలాశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వేలూరి తెలిపారు.

## తిరుపతి - చిక్‌మంగళూర్ మధ్య వీక్లీ స్పెషల్ ట్రైన్

- వచ్చే వారం ప్రారంభం.. చిత్తూరు మీదుగా ప్రయాణం !!

కుప్పం, జూన్ 29ప్రభాతవార్త

ఆధ్యాత్మిక నగరం తిరుపతి నుంచి కర్ణాటకలోని చిక్‌మంగళూర్ మధ్య కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నూతన వీక్లీ స్పెషల్ ట్రైన్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ రైలు వచ్చే వారం నుంచి ప్రయాణీకులకు అందుబాటులో రానున్నట్లు సమాచారం. ప్రతి గురువారం ఈ రైలు తిరుపతి - చిక్‌మంగళూర్ మధ్య ప్రయాణిస్తుంది. ఈ రైలు గురువారం రాత్రి 9గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు శుక్రవారం ఉదయం 10.30గంటలకు చిక్‌మంగళూరు చేరుతుంది.అలాగే చిక్ మంగళూర్‌లో ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 7.40గంటలకు తిరుపతి చేరుతుంది. ఈ రైలు చిత్తూరు మీదుగా కాటా ్పడి, కుప్పం, బంగారుపేట, వైట్‌ఫీల్డ్, కెఆర్‌పురం, బెంగళూరు, చిక్కబనవర్, తుమ్‌కూరు, తిప్‌టూర్, అరిసికెరె, దేవనూరు, బిరూర్, కదూర్, బిసాలేహళ్లి, శంకరాయపట్నం స్టేషన్లలో ఆగుతుంది.

## కారు ఢీకొని వృద్ధురాలు మృతి



కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో సామగుట్టపల్లి క్రాస్ వద్ద ఆదివారం రోడ్డుదాటుతున్న వృద్ధురాలిని కారు ఢీకొన్న సంఘట నలో వృద్ధురాలు మృతి చెందింది. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ ఎస్సై బాబు తెలిపిన మేరకు వివరాలిలా.. సామగుట్టపల్లి క్రాస్ వద్ద గౌరమ్మ (75) అనే మహిళ నివాసం ఉంటోంది. ఆదివారం ఆమె రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో వచ్చిన ఓ ఇన్నోవా కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో గౌరమ్మ అక్కడ కక్కడే మృతి చెందిందన్నారు. కాగా కారు డ్రైవర్ వేగంగా పరారయ్యే యత్నం చేయగా పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకున్నారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించి కారును స్వాధీనం చేసుకునికేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అధ్యక్షుడుగా నారాయణరెడ్డి

పుంగనూరు, జూన్ 29 ప్రభాతవార్త




ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ పుంగనూరు సర్కిల్ అధ్యక్షులుగా కేసి పల్లె బిపిఎం నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. పట్టణంలోని పెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా తాటికుంటపాలెం బిపిఎం ఎం రెడ్డప్ప రెడ్డి, వనమలదిన్నె బిపిఎం ప్రభాకర్ నాయుడు, ఎం సి బి పల్లె బిపిఎం విజయ్ కుమార్ యాదవ్ సెక్రటరీగా పరికిదోన బిపిఎం వి సుబ్రహ్మణ్యం అసిస్టెంట్ సెక్రటరీలుగా నడిగడ్డ ఏబిపిఎం కే రామయ్య, నంజంపేట బిపిఎం చిదానందం, మేళం దొడ్డి బిపిఎం నారాయణ, ట్రెజరర్‌గా కే ఎన్ కృష్ణమూర్తి, అసిస్టెంట్ ట్రెజరర్‌గా శ్రీనివాసులు సెక్రటరీగా ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆనంద నాయుడు, నరసింహులు, సురేష్ బాబు, హరి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రమేష్ బాబు, మోహన, చంద్రశేఖర్, విజయ్ కుమార్ ఎన్నికైయ్యారు.

## పిఎంకె తాండాలో ఉచిత మెగా వైద్య శిబిరం

రామకుప్పం, జూన్ 29 ప్రభాతవార్త




మండలంలోని పిఎంకె తాండాలో కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 200మందికి వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, నేతలు మునిరాజు నాయక్, కృష్ణానాయక్, ధనపాల్, మురళి, చంద్రబాబు, సుధాకర్, గజేం ద్ర, కుమార్, అనిల్, లయన్స్‌క్లబ్ సభ్యులు సెంధిల్, ప్రసాద్, చరణ్, కృష్ణమూర్తి, ఏకాంబరం పాల్గొన్నారు.

## హరిరాయల్‌కు అభినందనల వెల్లువ



చౌడేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త

చౌడేపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా నియమితులయిన పగడాల హరిరాయల్‌ను పలువురు నాయకులు, పారిశ్రామిక వేత్తలు అభినందించారు. ఆదివారం తేదేపా సీనియర్ నాయకుడు మాదిరాజు లక్ష్మణరాజు(పతిరాజు) ఆయన స్నేహితులు పగడాల హరిరాయల్‌ను దుశ్శాలవాలతో సత్కరించి అభినందించారు. రైతులకు అందుబాటులో వుండి వారికి సేవ చేయాలని ఉపోద్ఘాతించారు. కర్తీక్, విద్యాసాగర్ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## పూర్వ విద్యార్ధుల అపూర్వ కలయిక

- గురువులకు ఘనంగా సన్మానం




వెదురుకుప్పం, జూన్ 29 ప్రభాతవార్త :

పూర్వ విద్యార్ధుల అపూర్వ కలయిక చదువుకున్న పాత రోజులు గుర్తుచేసుకుని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. మండల కేంద్రంలోని వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-1995 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. సమావేశం ఏర్పాటు చేసి తమ ఉన్నతికి విద్యాభివృద్ధికి,ఉన్నతకి కృషి చేసి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన గురువులకు సన్మానం చేశారు. అనంతరం పాత రోజులు గుర్తుచేసుకుని తమ అనుభవాలను. అనుభూతులను స్నేహితులు పంచుకున్నారు. అనంతరం చదువు నేర్పిన పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం అందజేశారు. మధ్యాహ్నం మిత్రులందరు కలిసి భోజనాలు చేశారు.

## కుప్పంలో విద్యాలయాలు కాంగ్రెస్ హయాంలో వచ్చాయి

- కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల గోపి



కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో కాంగ్రెస్ పాలనలో కూడా పలు విద్యాలయాలు వచ్చాయని కుప్పం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల గోపి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో 2008లో అప్పటి సిఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో కుప్పానికి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ వచ్చిందన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలో కస్తూరిబా గురుకులాలు, ఎపి మోడల్ స్కూళ్లతో పాటు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలు వచ్చాయని గుర్తు చేశారు. మాజీ ఎంపి జ్ఞానేంద్రరెడ్డి చొరవతో ద్రవిడ వర్సిటీ ఏర్పాటైందన్నారు. సఫ పరిశ్రమ వచ్చిందన్నారు. ఇలా కుప్పంలో కాంగ్రెస్ పార్టీ గెలవకున్నా మేలు చేసిందన్నారు. కుప్పం ప్రాంతంలో సాగునీటి వనరులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భజలాలు అడుగంటాయన్నారు. హంద్రీ-నీవా జలాలు రెండు ప్రభుత్వాల పాలనలో కూడా రాలేదన్నారు. కుప్పం ప్రాంతంలో వలసల నివారణకు సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు మునస్వామి, కృష్ణప్ప, నంజప్ప, సుబ్రమణ్యం, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు నిజామ్, మైనార్టీ సెల్ ఇర్ఫాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

## కేంద్రపథకాలపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ



కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో వికసిత భారత్‌తో పాటు పలు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా బిజెపి నాయకులు కుప్పంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్ కరపత్రాలు పంచుతూ కేంద్రం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కుప్పం మండల అధ్యక్షుడు వడివేలు, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, నేతలు నితీష్‌కుమార్, ప్రభాకర్, శ్రీధర్, ప్రతాప్‌సింగ్, వసంత్, చల్లకుట్టి, అశోక్, సెంధిల్ పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

కుప్పంరూరల్, జూన్ 29 ప్రభాతవార్త



సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శారద కంటి ఆస్పత్రి వారిచే కుప్పం బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. సుమారు 120 మంది శిబిరంకు హాజరు కాగా వారికి కంటి వైద్యులు పరీక్షలు జరిపారు. 30 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబు, వ ంశీ, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కొత్త అందాలు సంతరించుకుంటున్న కొత్తకోట సాంఘిక సంక్షేమ హాస్టల్

పూతలపట్టు, జూన్ 29, ప్రభాతవార్త



చిత్తూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో మంజూరు కాబడిన సుమారు 20 లక్షల రూపాయల నిధులతో పి.కొత్తకోటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం కొత్త అందాలను సంతరించుకొని ఆధునిక వసతులతో విద్యార్థులకు అత్యంత సౌకర్యవంతంగా ఏర్పాటు కాబడినది. ఆధునికరించబడిన టాయిలెట్‌లతో పాటు స్నానపు గదులు చక్కగా రూపుదిద్దుకున్నవి విద్యార్థులు నివసించుటకు కావలసిన అన్ని సౌకర్యములు గదులలో ఏర్పాటు చేశారు. అదనంగా డైనింగ్ హాలు రూపుదిద్దుకొని విద్యార్థులకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా సరఫరా కాబడిన కొత్త వంట పాత్రలు, ట్రంకు పెట్టెలు మరింత మెరుగైన వసతులకు ఏర్పాటుచేశారు. ఈ నెల నుంచి సరఫరా కాబడిన నాణ్యమైన సన్న బియ్యంతో వండిన వంట విద్యార్థులకు లభించుచున్నది. వసతి గృహ సంక్షేమ అధికారి ఎన్ జై చంద్ర రెడ్డి ఎం ఏ బీఈడీ బిఎల్ ఆధ్వర్యంలో మరింత పురోగతి సాధిస్తూ కొత్త విద్యార్థులతో కలకలలాడుతున్నది. ప్రస్తుతము మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. జూలై నెల 1వ తేదీ నుండి వసతి గృహంలో ట్యూటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థుల విద్యాస్థాయిని పెంచడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పి. కొత్తకోట హాస్టల్ వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది అంకితభావంతో కృషి చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:




ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునే బాధ్యత అందరు తీసుకోవాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పిలుపునిచ్చారు. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, మంచి విద్యను అందించి, తల్లిదండ్రులకు నమ్మకం కల్గించి, ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ విద్యా కేంద్రాలుగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం జిఒనెం.19 ద్వారా 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసిందని, 9,652 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 1,552 ఉన్నత పాఠశాలలు, 5 వేలు ఫౌండేషన్ పాఠశాలలు, 19 వేల బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో ఫౌండేషన్, బేసిక ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం వుందని, వీటిని బలమైన పాఠశాలలుగా మార్చుకోవాల్సిన అవసరం వుందన్నారు. జిఒనెం.22 ద్వారా జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో 67,732 టీచర్లు బదిలీ అయ్యారని, 4,779 మందికి పదోన్నతులు లభించాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై వుందని, దానికి అనుగుణంగా విద్యా విధానంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సోమశేఖర్‌నాయుడు, రెహెనా బేగం, కె.రెడ్డప్పనాయుడు, ఎస్పీ భాషా, పిఆర్ మునిరత్నం, ఎ.కృష్ణమూర్తి, పివి ప్రకాష్, కె.సరిత, టి.దక్షిణామూర్తి, శశికుమార్, పార్థసారధి, నిర్మల పాల్గొన్నారు.

## ఇక చిత్తూరు మంచినీటి సమస్య ప్రారంభమయ్యే అవకాశం

- నేటి నుండి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు బహిష్కరణ

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహించే మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించనున్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గత కొన్ని రోజులుగా విధులు బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సైతం సోమవారం నుండి విధులు బహిష్కరించాలని నిర్ణయించడంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్య ఉత్పన్నం అయ్యే అవకాశం కన్పిస్తోంది. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నరసింహప్రసాద్‌కు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం కలిసి సోమవారం నుండి విధులు బహిష్కరిస్తున్నట్లు నోటీసులు అందజేశారు. నగర పరిధిలోని మంచినీటి సరఫరా విభాగంలో విధుల నిర్వహించే ఉద్యోగులు ఎవ్వరు సోమవారం నుండి విధుల్లో పాల్గొనడం లేదని, అలాగే ఇంజనీరింగ్ విభాగంలోని ఉద్యోగులు విధులను బహిష్కరిస్తున్నట్లు కమీషనర్‌కు వినతిపత్రంలో తెలియజేశారు.

## నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ వారం రద్దు అయ్యింది. కార్యక్రమం రద్దు చేయడంతో ప్రజలు ఎవ్వరు సమస్యలు చేతపట్టుకుని కలెక్టరేట్‌కు ఈ సోమవారం రావద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

## ట్రాఫిక్ సిబ్బందికి స్లో మోటర్ సైకిల్ రైడింగ్ పోటీలు

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త:



జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ఆదివారం చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో స్లో మోటర్ సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు స్లో మోటర్ సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తుండటంతో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు ప్రీట్రయల్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో కానిస్టే బుల్ మార్కొండన్ మొదటి స్థానం, కానిస్టేబుల్ రాజేష్ రెండవ స్థానం, కానిస్టేబుల్ తేజోవతి మూడవ స్థానం దక్కించుకున్నారు. టాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నియ మాల పట్ల అవగాహన పెంచడానికి ఇలాంటి పోటీలు ఉపయుక్తంగా వుంటాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి పోటీకి దరఖాస్తు చేసుకున్న వారు రానున్న ఓపెన్ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందని ఆయన తెలిపారు.

## జనసేన కిట్లు పంపిణి



శ్రీకాళహస్తి రూరల్,జూన్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, శ్రీకాళహస్తిలోని 4,35 వార్డుల్లో జనసేన కిట్లను పార్టీ నిర్వాహకులు అందజేసారు. పేట చంద్రశేఖర్ సారధ్యంలో పార్టీ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తికి సమీపంలోని కమ్మకొత్తూరు, నాల్గవ వార్డు తెట్టు, 35వ వార్డు బిపి అగ్రహారాల్లో జనసేన పార్టీ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ప్రతి వార్డులోనూ, పల్లెల్లోనూ జనసేన సభ్యత్వ నమోదును చేపట్టాలని సూచించారు. సభ్యత్వ నమోదు పారదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క ఇంటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన భరోసాను వివరించాలన్నారు.ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, లక్ష్మణ్, నవీన్,రాజా,చందు,ఈశ్వరయ్య, సాంబ,కత్తి మణి,ముని ప్రసాద్,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## అక్షయ క్షేత్రంలో యువనేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తిరుపతిరూరల్, జూన్29 ప్రభాతవార్త:



తుడ మాజీ చైర్మెన్, తిరుపతిరూరల్ మాజీ ఎంపిపి, చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు నిరాడంబరంగా నిర్వహించారు. మోహిత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైయస్సార్సిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆదివారం అక్షయ క్షేత్రంలో బుద్ధిమాంద్య పిల్లలు, వికలాంగుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా విద్యార్థి విభాగం నాయకులు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రఫీ, శేషారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, పార్థసారధి,, వెంకటరమణ నాయక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంఎల్‌ఏ చొరవ దేశం నాయకులు

తొట్టంబేడు,జూన్ 29 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అధికారులను పరుగులు తీయించి పరిష్కరిస్తున్నారని మండల మాఈజ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు ఆదివారం అన్నారు. కొణతనేరి పంచాయతీ గుర్రప్పనాయుడు కండ్రిగ గ్రామంలో ఇంటి మీద కరెంటు తీగలు వేలాడుతుండగా ఏళ్ళ తరబడి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు.ఈ సమస్యను పలుమార్లు రెవెన్యూ అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు గ్రామాల వంక తిరిగి చూడలేదన్నారు. ప్రస్తుతం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి గ్రామీణ సమస్యలపై దృష్టి సారించారన్నారు. ఆయన దృష్టికి సమస్య వెళ్ళిన వెంటనే ఆయా మండలాల్లో పార్టీ నాయకుల నుంచి సమాచారం తెప్పించుకొని అధికారులను పరుగులు తీయిస్తున్నారని మురళీనాయుడు అన్నారు.ఈ నేపధ్యంలో కొణతనేరి పంచాయతీలోని గుర్రప్పనాయుడు కండ్రిగలో ఇళ్ళ మీద నుంచి వెళ్ళు విద్యుత్ లైన్లను మార్పించుటకు కొత్తగా పోల్స్ వేయించారని మురళీనాయుడు వివరించారు. ఏళ్ళ నాటి సమస్యను పరిష్కరించిన ఎంఎల్ఏకు పలువురు ధన్యవాదాలు తెలిపారని వివరించారు.కరెంటు పోల్స్ మళ్ళింపులో విద్యుత్ శాఖ ఎఇఇ బాలాజి దగ్గరుండి పనులు చేయించారని తెలిపారు.

## నాటుసారా స్వాధీనం.. మహిళ అరెస్ట్

కుప్పం, జూన్ 29 ప్రభాతవార్త



నాటుసారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. కొటాలూరు పంచాయతీ గుండ్లమడుగుకు చెందిన దినకర్ భార్య సంపూర్ణ (38) అనే మహిళ నాటుసారా విక్రయాలు జరుపుతుండగా ఆమెను అరెస్ట్ చేశామన్నారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ, విక్రయాలు జరిపితే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పజలతో కలిసి మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి నాయకులు..



తిరుపతి రవాణా, జూన్ 29 ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనస్సులోని భావాలను తెలియజేస్తూ కోట్ల మంది ప్రజలతో ప్రత్యక్షంగా మా ట్లాడే మన్ కి బాత్ కార్యక్రమాని దేశ వ్యాప్తంగా మంచి ఆదరణ లభించింది. ఈ కార్యక్రమాన్ని బిజెపి సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి వాసులు ఆసక్తిగా తిలకించారు. ప్రతినెలా చివరి ఆదివారం జరిగే మన్ కి బాత్ కార్యక్రమాన్ని తాము తప్పకుండా వీక్షిస్తున్నామని ప్రధానమంత్రి కొత్త విషయాలను తెలియజేస్తున్నారని గుండాల గోపీనాథ్ రెడ్డి తెలియజేశారు. మన్ కీ బాత్ కార్యక్రమం స్ఫూర్తిదాయకమంటున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, స్థానికులు మరియు బిజెపి నాయకులు జనార్దన్ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, చంగల్రాయ ఆచారి, వెంకటరత్నం,చెంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు

## అవిలాల మఠం భూములలో యధేచ్ఛగా బోరుడ్రిల్లింగ్

తిరుపతిరూరల్, జూన్29 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని వివాదస్పద మఠం భూములలో యదేచ్ఛగా బోరుడ్రిల్లింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేసారు. పంచాయతీ నుండి ఎలాంటి అనుమతి లేకుండా 3బోర్లు డ్రిల్ చేసారని పంచాయతీ కార్యవర్గ సభ్యులు తెలిపారు. మఠం భూముల అన్యాక్రాంతంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిరూరల్ పోలీసు స్టేషన్‌కు ఎదురుగా పెద్దఎత్తున అక్రమబ నిర్మాణాలు జరుగుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖరీదైన ప్రభుత్వ భూములు పరిరక్షించాలని కోరుతున్నారు.

=========

# పురవీధుల్లో బకాసురుని బిక్షాటనం

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బకాసురుని బిక్షాటన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో ముగ్గురు బకాసుర వేష ధారులు ఎద్దుల బండ్లపై ఎక్కి బిక్షాటన చేశారు. భారతంలో బకాసుర సంఘటనను కన్నుల కట్టినట్లు ఏర్పాటు చేశారు. చేతిలో గద పట్టుకొని బండిమీద కూర్చొని వస్తుంటే పాతకాలం నాటి వారు 'బండికూడు బకాసురుడు' వస్తున్నాడంటూ ఇళ్ళలోంచి అన్నం కూరల్ని తెచ్చి సమర్పించారు.చిన్న పిల్లలు ఈ బకాసురుడు ఎవరు? ఎందుకు ఆయనకు మనం అన్నం పెట్టాలని ప్రశ్నించటం కనబడింది. అంటే మమ్మీ డాడీ చదువుల మాయలో ఈ తరం పిల్లలకు భారత,భాగవత,రామాయణ, ఇతిహాసాలకు సంబంధించి పూర్తిగా అవగాహన లేకుండా పోయిందని ఈ సంఘటనలతో చెప్పవచ్చు.దాంతో తల్లి దండ్రులు భారతం గురించి అందులో పాత్రలు యుద్ధాలు గురించి వివరించారు.ఉదయం ధర్మరాజుల ఆలయం వద్ద గల అలంకార మండపంలో ఆలయ అలంకార గురుకుల్ రాజేష్ అర్జునుడు,శ్రీకృష్ణుడు, ద్రౌపదీ దేవిల విగ్రహాల్ని చక్కగా ముస్తాబు చేశారు. సప్పరంలో ప్రతిషింపజేసి



పట్టణంలో ఊరేగింపు జరిపారు. భారత పఠనంలో హిడింబాసుర, బకాసుర వధ వచ్చింది.ఈ మేరకు నాట్యరూపంలో ప్రదర్శన ఇచ్చారు. రంగస్థల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. బకాసుర వధ అనంతరం పట్టణంలో భీముని ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించారు.పట్టణం మొత్తం తిరగాలి కాబట్టి ముగ్గురు భీములను సృష్టించారు. రంగస్థల కళాకారులు భీముని వేషాలు ధరించి తేరువీధి,నాలుగుమాడావీధుల్లో ఒకరు, బహాదూరుపేటలో ఒకరు, ముత్యాలమ్మగుడివీధి తదితర ప్రాంతాల్లో మరొకరు బిక్షాటన గావించారు. కాగా సాయంత్రం హిడింబాసుర, బకాసుర వధ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. రంగస్థల కళాకారులు పాల్గొన్నారు. మేళతాళాలు,పంబజోళ్ళ మోతతో ఊరేగింపు సాగింది.ఉత్సవాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షించారు. ఆలయ పర్యవేక్షకులు దుర్గా ప్రసాద్, సాయి, ఆలయ పూజారులు పురుషోత్తం,రవి,తులసి తదితరులు వెంటరాగా ఉభయదారులు జూలుగంటి భీమరాజులశెట్టి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.చిన్న ఆలయాల ఆలయ హెడ్ కుక్ గోపాల్ ఉత్సవాల్ని సకాలంలో నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నారు.ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి,ఎఇఒ హేమామాలిని పర్యవేక్షించారు.ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ఊరేగింపులుపట్టణంలో జరుగుతున్నాయి.

# తిరుపతి డివిజన్

## శ్రీశక్తి పీఠంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు

రామచంద్రాపురం, జూన్ 29 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠాన్ని ఆదివారం టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు దంపతులు సందర్శించారు. శ్రీశ్వేత వారాహి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఠంకు చేరుకున్న ఆయనకు పీఠం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశ్వేత వారాహిదేవికి, శ్రీమరకత శక్తి కాళీమాతకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. పీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి, మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి స్వాముల ఆశీర్వాదం పొందారు. పీఠం నిర్వహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సెక్యూరిటీ గార్డ్ అనుమానాస్పద మృతి.....

### వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు....

రేణిగుంట జూన్ 29 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుపతి -రేణిగుంట రహదారి పక్కన ఉన్న పారిశ్రామిక వాడనందు శ్రీ శ్రీనివాస ప్రైవేటు ఐటిఐ సమీపంలో కృష్ణారెడ్డి (65) అనే వాచ్మెన్ ఆదివారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా.. వెదురుకుప్పం మండలం తిరుమలాయ పల్లె గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తిరుపతిలోని ఓ అపార్ట్మెంట్లో ఉంటున్నాడు. అతను రేణిగుంట పారిశ్రామిక వాడలోని ఓ వైన్ షాప్ నందు నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం విధులకు వచ్చి ఆదివారం ఉదయం విధులు ముగించుకుని వెళ్లాడు. ఉదయం ఎనిమిది గంటలకు భార్య ఫోన్ చేయగా ఫోన్ రింగ్ అయినట్లు అతను లిఫ్ట్ చేయనట్లు ఆమె పోలీసులకు తెలిపింది. అదే ఫోన్ నుండి ఎవరు కాల్ చేసి కృష్ణారెడ్డి పారిశ్రామిక వాడ నందు శ్రీ శ్రీనివాస ప్రైవేట్ ఐటిఐ సమీపంలో పడి ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. విషయం తెలుసుకున్న వెంటనే రూరల్ సీఐ మంజునాథ రెడ్డి ఆదేశాలతో ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకొని అతను మరణించిన తీరును గుర్తించారు. మృతుని శరీరంపై చిన్న చిన్న గాయాలు ఉన్నాయి. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ లను రప్పించి ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. పోలీసులు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత ఎలా మృతి చెందాడో తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

## తారకరామా నగర్ పై పోలీసుల ఆకస్మిక దాడులు...

### . 18 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్....

రేణిగుంట జూన్ 29 ప్రభాతవార్త

తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో రేణిగుంట సబ్ డివిజన్ పోలీసులు అర్బన్ సీఐ జయచంద్ర పర్యవేక్షణలో అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, ఏర్పేడు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో కార్డన్‌సర్చ్ (వలయ తనిఖీలు) లో భాగంగా కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్ నందు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఎవ్వరికి తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా వలయకార తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో ఉన్న వారి వివరాలు ఆధార్ కార్డుల ద్వారా సేకరించారు. దాడుల్లో రికార్డులు సరిగ్గా లేని 18 ద్విచక్ర వాహనాలను,3 ఆటోలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. ప్రతి ఒక్కరు సంఘానికి సమాజానికి ఉపయోగపడాలని సీఐ జయచంద్ర అన్నారు. కార్మికుల పేరుతో కొంతమంది ఆగంతకులు వస్తున్నారని వారికి ఇళ్లను అద్దెకిచ్చేటప్పుడు సరైన ఆధారాలు తీసుకొని అద్దెకివ్వాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆర్జిటి 3. కార్డన్ సెర్చ్ లో పట్టుబడిన వాహనాలు.

## ముందస్తు ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోండి.

తిరుపతి విద్య జూన్ 29 ప్రభాత వార్త

ప్రభుత్వ నియమ నిబంధనలను,ఫీజుల నియంత్రణ చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, తిరుపతిలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని అఖిల ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శి శివారెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు.ముందస్తు అడ్మిషన్ల పేరుతో భారీ డొనేషన్లు వసూలు చేయడంతో పాటు,ఫీజు నియంత్రణ కమిటీ నిర్ధారించిన ఫీజుల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.ఇందులో ప్రధానంగా కరకంబాడి రోడ్డులోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ అడ్మిషన్ ప్రొహిబిషన్ ఆఫ్ క్యాపిటేషన్ ఫీజు చట్టాన్ని,ఫీజు నియంత్రణ చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు.ఉన్నతాధికారులు తక్షణం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంటర్వ్యూకు హాజరుకాకపోతే తొలగిస్తాం.

తిరుపతి విద్య జూన్ 29 ప్రభాత వార్త



ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్లకు ఫర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో మంగళవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకాకపోతే విధుల నుంచి తక్షణం తొలగిస్తామని రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తాత్కాలిక అధ్యాపకులకు సమాచారం అందించారు.మంగళవారం 43 మందికి,2వ తేదీ 51మందికి,3వ తేదీన 47 మందికి,4న 51మందికి, 5వ తేదీన 51మంది తాత్కాలిక అధ్యాపకులకు వీసీ ఛాంబర్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## అప్పుల బాధతో టిడిపి కార్యకర్త ఆత్మహత్య

నారాయణవనం, జూన్ 29 ప్రభాతవార్త :



మండలంలోని కశింమిట్ట పంచాయతీ ఇప్పతాంగేల్ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఎం మునిరామయ్య రెండు రోజుల క్రితం అప్పుల బాధను తట్టుకోలేక వడిసాకు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. రెండు రోజులుగా తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయనకి భార్య ఇద్దరు పిల్లలు వున్నారు. అప్పులు అధికం కావడంతో ఇవ్వాల్సిన అప్పుదారుల నుంచి వేధింపులు అధికంకావడంతో వడిసాకు తిని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో కేసు నమోదు చేశారు. పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

## గంగజాతరను ఘనంగా నిర్వహిద్దాం

పుత్తూరు రూరల్, జూన్ 29 ప్రభాతవార్త:



గంగజాతరను ఘనంగా నిర్వహించుకుందామని జాతర నిర్వాహకులు తెలిపారు. నిర్వహణ నిమిత్తం ఆదివారం ప్రత్యేక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఆగస్టు 19వ తేదీ మంగళవారం ఉదయం గ్రామదేవత శ్రీ ఆరేటమ్మ తల్లికి పాలాభిషేకం అదే రోజు సాయంత్రం పుత్తూరు పట్టణ పురవీధుల్లో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఆగస్టు 31న ఆదివారం గంగజాతర చాటింపు, సెప్టెంబరు2 మంగళవారం రాత్రి చాటుబండి ఊరేగింపు, సెప్టెంబరు 3న బుధవారం గంగజాతర ప్రధాన వేడుకనిర్వహించేందుకు నిర్ణయించారువారు మాట్లాడుతూ జాతరను విజయవంతంగా నిర్వ హించేందుకు కావలసిన ఏర్పాట్లపై చర్చించి విభాగాల వారీగా బాధ్యతలు జరిగిందన్నారు. పట్టణ ప్రజలు, గ్రామస్తులు, భక్తులు సహకారంతో గంగజాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

## హిండింబాసుర,బకాసుర వధ

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయ ఆవరణలో హిడింబాసుర,బకాసుర వధలను నిర్వహించారు. రంగస్థల కళాకారులు భారతంలోని సన్నివేశాలను చక్కగా ప్రదర్శించారు. ఆలయ ఆవరణలో ఆదివారం కావటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చారు.ఏర్పాట్లను చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో నిర్వహించారు.

## డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు

### బిసి సంఘంచే ర్యాలీ

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త




డ్రగ్స్ వద్దు జీవితమే ముద్దు అంటూ తెలుగుదేశం బిసి విభాగం నాయకులు ఆదివారం పట్టణంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డ్రగ్స్ రహిత ఆంధ్రా తీర్చిదిద్దుటకు చర్యలు తీసుకుంటుందన్నారు. సమాజంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమించి మానవాళిని సమూలంగా నిర్వేదం చేస్తూ మరణానికి దారితీస్తున్న మత్తు పదార్థాల వాడకాన్ని తరిమద్దాం రండి అంటూ నినాదాలుచేస్తూ రాష్ట్ర బిసి విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక జయరామరావు వీధిలోని పూసల వీధి కూడలిలో మాదక ద్రవ్యాల నిషేధంపై ప్రజల చేత ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమాల్లో ఉమేష్‌రావుతో పాటు జి.దశరధాచ్చారి.మిన్నల రవి, మునిరాజాయాదవ్, వజ్రం కిషోర్,కోట చంద్రశేఖర్,భీమాల భాస్కర్, చాంద్‌బాషా,మణి,భగత్ మురళీ కృష్ణ,సుకుమార్, శివ,సులేమాన్, గగన్‌యాదవ్, కృష్ణమూర్తి,రియాజ్,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలును పరిశీలించారు: తులసీ మొక్కనాటారు

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని సబ్‌జైలును ఆదివారం సీనియర్ సివిల్ జడ్జి చిత్తూరు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటి కార్యదర్శి ఎన్ ఎస్ బారతి ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సబ్‌జైలులో తులసీ మొక్కను నాటారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్‌జైలులను పరిశీలించి జూలై 5న జరిగే జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.జైలు రూంలలో పరిశుభ్రత, వంటశాల, స్టోర్ రూం,మరుగుదొడ్లను పరిశీలించారు. ఇక్కడ ఉన్న ఖైదీలతో మాట్లాడినారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు సబ్ జైలు సూపరింటెండెంట్ శ్రీకాంత్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది,పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీకి ప్రత్యేక చట్టంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. అలాగే బెయిల్ గురించి ఉచిత న్యాయం,న్యాయ చట్టం లపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా దరఖాస్తు రూపంలో ఇస్తే మీ సమస్య పరిష్కరించుటకు ప్రయత్నిస్తామన్నారు.జైలు జీవితంలో పరివర్తన పొందాలన్నారు. మళ్ళీ తప్పులు చేయకుండా ఉండాలంటే చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు.

## యూత్ సెల్ డైరెక్టర్‌గా వర్ధన్



శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి జిల్లా యూత్ ఎసెల్ డైరెక్టర్‌గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దావాల వర్ధన్ నియమితులైనట్లు ఆదివారం తెలిపారు. ఈ మేరకు సంస్థ దక్షిణ భారత దేశ చైర్మెన్ కుర్రసూర్యనారాయణ నియామక పత్రంను అందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ పోలీసు విజిలెన్స్ డైరెక్టర్ ఆశోక్ కుమార్, ఎపి స్టేట్ చైర్మెన్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మన్‌కి బాత్‌ను జనాల్లోకి తీసుకెళ్ళాలి!

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త



భారత ప్రధాని మన్‌కి బాత్ కార్యక్రమాల్లో రాష్ట్రబిజెపి కార్యదర్శి కోలా ఆనంద్, తిరుపతిజిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్పలు వేర్వేరుగా ఏర్పాటు చేసి ఆలకించారు.ప్రధాని మదిలోని మాటను వివరిస్తూ భారత దేశ ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాలు అయిన సందర్బంగా ఎన్నో సంస్కరణలను చేపట్టారన్నారు. భారత దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పటంలో ఎన్నో చర్యలు తీసుకున్నారన్నారు. 11 సంవత్సరాల కాలంలో మోదీ 123 సార్లు మన్‌కి బాత్‌ను వినిపించారన్నారు. మన్‌కి బాత్‌లో విశాఖలో జరిగిన యోగా కు సంబంధించి అభినందనల వర్షం కురిపించారు.ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని వివరించారు. అలాగే శ్రీరామనగర్ కాలనీలో మాజీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప సారధ్యంలో కార్యకర్తలు మన్‌కి బాత్ కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమాల్లో మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, వేదాం కృష్ణయ్య, భరత్‌నాయుడు, డిల్లి రెడ్డి, నాని, ఢిల్లిబాబు కండ్రిగ ఉమ, లత,అరుణ,జోనయతి, ప్రయాంక,రాజా, రమేష్, చంద్రశేఖర్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## టీ టెన్ క్రికెట్ టోర్నీ విజేత రెడ్ ఈగల్స్

వడమాలపేట, జూన్ 29 ప్రభాతవార్త:




వడమాలపేటలో గత 15 రోజులుగా జరుగుతున్న టీ టెన్ క్రికెట్ టోర్నీ విజేతగా తిరుపతి మిట్టూరుకు చెందిన రెడ్ ఈగల్స్ జట్టు విజేతగా నిలిచింది. గత 15 రోజులుగా జరిగిన ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్ ఆదివారం జరిగింది. పాడిపేట ఆర్‌సీయూత్ జట్టు, రెడ్ ఈగల్స్ జట్లు పోటీ పడగా ఈగల్స్ జట్టు 13 రన్స్ తేడాతో గెలుపొందింది. టోర్నీవిజేత జట్టుకు రూ.33,333లు, షీల్డ్‌లను వడమాలపేట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు డిల్లీ ప్రసాద్ అందజేశారు. రన్నర్ జట్టుకు రూ.22,222లు, ట్రోఫీ, 3వ బహుమతిగా వడమాలపేట రైజింగ్ స్టార్ జట్టుకు రూ.7,777లు, 4వ స్థానంలో నిలిచిన తిరుపతికి చెందిన రాము లెవెన్స్ జట్టుకు రూ.5,555లను బహుమతిగా అందజేశారు. ఈ టోర్నీలో 38 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు దాముయాదవ్, కార్యదర్శి శివ రాయల్, శ్రీ బొమ్మరాజపురం సర్పంచ్ మణిరాజు, రాధాకృష్ణలు బహుమతులు అందజేశారు. ఈ క్రికెట్ టోర్నీ వడమాలపేట యూత్ అసోసియేషన్ క్రీడాకారులు భాస్కర్‌రెడ్డి, పవన్, పండు, సునీల్, శివయ్యల ఆధ్వర్యంలో జరిగింది.

## ఫేక్ కాల్స్‌తో బెదిరింపులు

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని వ్యాపారులకు కొన్ని నెంబర్ల నుంచి ఫేక్ కాల్స్ చేసి సమాచారం కావాలని కోరటం ఆదివారం చోటు చేసుకుంది. ఉదయం నుంచి ఒక నెంబర్‌కు పదే పదే మహిళ,మగవారు మార్చి మార్చి ఫోన్ చేయటం ఎందుకు ఫోన్ చేస్తున్నారని ప్రశ్నిస్తే తిరగబడి మాట్లాడటం 'దమ్ముంటే పోలీసులకు ఫిర్యాదు చేయమని' బెదిరించటం కొంత సేపు తెలుగులో మరి కొంత సేపు ఆంగ్లంలో అదే నెంబర్ నుంచి మరో మగవ్యక్తి తమిళంలో మాట్లాడటం గమనించదగ్గ విషయం. సెల్ నెంబర్ 8248002429 నుంచి 9866171822,8071939918 నుంచి కాల్స్ చేసి మా వాళ్ళు మీ వద్ద సరకులు కొనుగోలు చేసారు.సొమ్ములు గూగుల్ పే చేసారంటూ దాని వివరాలు కావాలంటూ కొరుతున్నారు. ఉదయం నుంచి శ్రీకాళహస్తిలోని పలువురు వ్యాపారులకు ఇదే కాల్స్ రావటం గమనించదగ్గ విషయం.మళ్ళీ మళ్ళీ కాల్స్ చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటే దమ్ముంటే రిపోర్ట్ చేయమంటూ బెదిరించటం కొసమెరుపు. రోజు రోజుకు సైబర్‌నేరాలు హద్దులు దాటుతున్నాయి. దాంతో కొత్త నెంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే తీయటానికి భయపడుతున్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి వరంగల్‌కు చెందిన భక్తులు భూరి విరాళాలను అందించారు. ఆదివారం వరంగల్‌కు చెందిన గుండా లలిత్‌కేశవ్ దంపతులు, గుండా రామ్ శివ్‌కేశవ్ దంపతులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఎఇఒ మోహన్‌ను కలసి తాము ఆలయానికి విరాళం అందించుటకు కోరారు. దాంతో ఆయన కార్యాలయంలో ఒక్కొక్కరు రూ.51వేల చొప్పున నిత్యాన్న ప్రసాదానికి విరాళంగా అందించారు. వారికి ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.తరువాత వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## అవార్డుల కమిటీలో శ్రీకాళహస్తి కళాకారునికి అవకాశం

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త



భారత దేశంలోని మినిస్టరీ ఆఫ్ టెక్స్‌టైల్స్ శిల్పగురు అవార్డుల కమిటిని నియమించింది.ఈ కమిటిలో శ్రీకాళహస్తి కళాకారునికి అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో కళాకారులకు సంబంధించిన అవార్డుల ఎంపికకు ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేసారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ కళాకారుని ఎంపిక చేసారు. అది శ్రీకాళహస్తికి సంబంధించిన శిల్ప గురు అవార్డు గ్రహీత వేలాయుధం శ్రీనివాసులు రెడ్డికి అవకాశం లభించింది, కమిటి చైర్మెన్‌గా టెక్స్‌టైల్స్ కార్యదర్శిగా నీలం షామిరావు సభ్యులుగా ఒక్కొక్క విభాగం నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసారు. అమ్రిత్‌రాజ్ డాక్టర్ బీనా, కన్వీనర్‌గా నీమా మిశ్ర, డాక్టర్ అశోక్ మోనడల్,నీరజఖాన్ డాక్టర్ రజనీ కాంత్ ప్రొఫెసర్ సంజీవ్, పూర్ణిమ రాజ్,జహ్నాబి ఫూకాన్,అయుష్ కాసిలవాల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారి చేసింది.శ్రీకాళహస్తిలో కలంకారి కళను దేశ వ్యాప్తంగా విస్తరింపజేయటంలో తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్న కళాకారునికి అరుదైన అవకాశం లభించటం పట్ల పలువురు అభినందించారు.

# ఇంటింటికి వెళదాం: కూటమి అభివృద్ధిని వివరిద్దాం

## సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,జూన్ 29 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మార్గదర్శకత్వం లో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశలో పయనిస్తుండగా పుణ్యక్షేత్రంను ప్రగతి పథంలో పయనింపజేయుటకు ఇంటింటికి వెళదామని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిద్దామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు.ఆదివారం ఆయన ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో పాటు నియోజకవర్గాలను సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తున్నారని వివరించారు.శ్రీకాళహస్తి ప్రగతికి ప్రతిష్టాత్మకమైన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవటం మొదటి ప్రగతి అన్నారు.అలాగే దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలుకు అడ్డంకులైన అవరోధాలను యువ నాయకుడు



నారాలో కేష్ తొలగించారని సుధీర్‌రెడ్డి వివరించారు.శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని గ్రామాల్లో తారు రోడ్డు ఏర్పాట్లును చేపట్టారన్నారు. పరిపాలనలో సంస్కరణలు చేపట్టబడుతుందని పారిశ్రామికంగా పరిశ్రమలు తీసుకురావటానికి ముఖ్యమంత్రి సహాకారం అంతా ఇంతా కాదన్నారు.ఈ అంశాలను ప్రతి ఇంటికి వెళ్ళి వివరించాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సమాకారం అందించారన్నారు. ఇక ఎస్ ఎస్ కెనాల్, భెల్ పరిశ్రమ స్థానంలో కొత్త పరిశ్రమలకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పిలుపు మేరకు ద్వితీయ శ్రేణి నాయకులు ఇంటింటికి వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి సాధించిన ప్రగతిని వైకాపా పాలనలో దోచుకున్న వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు.

